క్లుప్తంగా

'డబుల్' పథకాన్ని అమలు చేయాలి



నివాదాలు చేస్తున్న ఎంసీపీఐ నాయకులు

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో డబుల్ బెడ్రూం పథకాన్ని అమలు చేయాలని ఎంసీపీఐ జిల్లా అధ్యక్షుడు గోలి వేణు, చేనేత కార్మిక సంఘం సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు కట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం కోనరావుపేటలో విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజల కోసం పనిచేస్తున్నామని చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో నిరుపేదలను విస్మరించిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చాలా మంది పేదలు ఇల్లులేక ఇబ్బందులు పడుతున్నా ఒప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కూడా కట్టివ్వలేకపోయారని విమర్శించారు. ఇళ్ల కోసం లబ్ధిదారులను గుర్తించి సంవత్సరాలు గడుస్తున్నా ఎలాంటి ప్రయోజనం కలుగడంలేదన్నారు. గ్రామాల్లో బీడీ కార్మికులు కూడా అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. వారి వెంట నాయకులు వంగపెల్లి బాలయ్య, దూది పోచయ్య, ఇతర నాయకులు ఉన్నారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఎల్లారెడ్డిపేట: అనారోగ్యంతో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన బలరాం కుటుంబానికి అతని పదో తరగతి సహచర మిత్రులు అండగా నిలిచారు. ఆదివారం బలరాం కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు గుండారపు కృష్ణారెడ్డి, రాఘవేందర్, చామంతుల అనిల్, రాపోలు బాబు, గుండెల్లి స్వామి, శివ తోపాటు సర్పంచ్ ముక్క మధుకర్, ఉప సర్పంచ్ ప్రదీప్ రెడ్డి, శ్రీధర్, జనార్ధన్, రవి నాయక్, మహేందర్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న హరికృష్ణ

బోయినపల్లి: పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయోగపడే రూ.50 వేల విలువగల పుస్తకాలను మండలంలోని గుండన్నపల్లికి చెందిన ప్రసన్న హరికృష్ణ ఆదివారం స్థానిక గ్రంథాలయానికి అందజేశారు. విన్నర్స్ పబ్లికేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ పుస్తకాలు గ్రూప్స్, హాస్టల్ వార్డెన్, ఎస్సై, పీసీ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఎంపీటీసీ అక్కెనపెల్లి ఉపేందర్, నాయకులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం తప్పని తిప్పలు

- తెప్పలపై ప్రయాణం
- సాహసం చేస్తున్న రైతులు, కూలీలు, గీత కార్మికులు
- పెరిగిన దూరభారం
- ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం
- బ్రిడ్జి నిర్మించాలని రైతుల వేడుకోలు



మూలవాగులో తెప్పపై పొలానికి వెళ్తున్న రైతు



కల్లు గీసేందుకు వెళ్తున్న గీత కార్మికుడు

వేములవాడఅర్బన్: మధ్య మానేరు ముంపునకు గురైన గ్రామాల్లో వేములవాడ మండలం సంకెపల్లి గ్రామం ఒకటి. ఈ గ్రామస్తులకు ప్రభుత్వం ఆర్అండ్ఆర్ కాలనీలు కేటాయించడంతో ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నారు. కాని పూర్తిగా వ్యవసాయం, కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వీరు పొట్టకూటి కోసం మూలవాగు అవలివైపు వెళ్లేందుకు నానా యాతన పడుతున్నారు.

తప్పని పరిస్థితిల్లో..

మూలవాగు అవతల పక్కన ఉన్న ఈ గ్రామానికి చెందిన 40 మంది రైతులకు చెందిన సుమారు 250 ఎకరాలు ఉన్నాయి. మిడ్ మానేరు బ్యాక్ వాటర్ మూలవాగులో వేములవాడ ఎల్లమ్మ దేవాలయం వరకు ఉండటంతో వ్యవసాయం చేసుకుని బతికే రైతులకు మూలవాగు మీదుగా దారి లేక నాంపల్లి–వేములవాడ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు దారిలేక రైతులు సాహసం చేయాల్సి వస్తోంది. కొందరు రైతులు బ్యాక్వాటర్లో తెప్పలపై వెళ్తుండగా, మరికొందరు ద్విచక్ర వాహనాలపై వెళ్లి వస్తున్నారు. అలాగే ఆవలివైపు ఉన్న తాటిచెట్లు గీసేందుకు గీత కార్మికులు కూడా తెప్పలపై ప్రయాణం చేయాల్సివస్తోంది.

భారంగా మారిన ప్రయాణం

సంకెపల్లి మూలవాగులో నీటిని దాటే వీలులేక నాంపల్లి–వేములవాడ మీదుగా పంట పొలాలకు వెళ్తున్నారు. మూలవాగులో బ్యాక్ వాటర్ లేనప్పుడు పంట పొలాల్లోకి వెళ్లాలంటే రెండున్నర కిలోమీటర్లు మాత్రమే ఉండేదని, ఇప్పుడు రానుపోను 25 కిలోమీటర్లు అవుతోందని రైతులు తెలిపారు. దీంతో ప్రతీరోజు వెళ్లేందుకు ఇబ్బందితో పాటు, వాహనాల కిరాయి భారంగా మారిందని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాత గ్రామం నుంచి మూలవాగుపై సుమారుగా 400 మీటర్లు బ్రిడ్జి ఏర్పాటు చేస్తే శాశ్వతంగా వీరి సమస్యలన్నీ తీరిపోతాయని భావిస్తున్నారు.

ఉపాధి కోసం సాహసం



ముంపు గ్రామం కావడంతో తాటి చెట్లు నీటితో మునిగిపోయాయి. దాంతో ఉపాధి కరువైంది. అవతల ఒడ్డుకు ఉన్న తాటి చెట్లను వద్దకు తెప్పలపై వెళ్లి కల్లు గీసి తీసుకువస్తున్నాం. పొట్టకూటి కోసం ఈ సాహసం చేయాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మిస్తే ఇబ్బందులు తప్పుతాయి.

– పల్లి తిరుపతిగౌడ్, సంకెపల్లి

తెప్పలపై పొలంకాడికి



పొలంకాడికి వెళ్లేందుకు ప్రతీరోజు రెండు సార్లు తెప్పపై వెళ్తున్నా. అలా వెళ్లడం ప్రమాదమని తెలిసినా, తప్పడం లేదు. మొదట కొంచెం భయంగా ఉండేది. ఇప్పుడు అలవాటుగా మారింది. కాని ఇలా ఎన్ని రోజులు తెప్పలపై ప్రయాణించడమని కూడా అనిపిస్తోంది. ప్రభుత్వం స్పందించాలి.

– పోచంపల్లి కిష్టయ్య, సంకెపల్లి

ద్విచక్ర వాహనంపై వెళ్తున్నా



సంకెపల్లి నుంచి నాంపల్లి మీదుగా వేములవాడ నుంచి పొలంకి రావాలంటే ఇబ్బందిగా మారింది. రోజుకు రెండుసార్లు వస్తున్నా, ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్లాలంటే సుమారుగా రానుపోను 25 కిలోమీటర్లు అవుతుంది. వ్యవసాయానికి వచ్చే పైసలు ఎక్కువ పెట్రోల్కే ఖర్చవుతున్నాయి.

– పెరుగు శంకర్, రైతు సంకెపల్లి

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్లటౌన్: బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక పాలన కొనసాగిస్తోందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటుందని, రైతులకు నష్టం కలిగించేలా వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని, డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుంటి వేణు, కడారి రాములు, పంతం రవి, విమల, పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

తంగళ్లపల్లి: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 33 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై తిరిగి కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు తుడి వెంకట్రావు, ఉపాధ్యాయులు సంపత్చారి, కిషన్రావు, ప్రవీణ్రావు, సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రకథ



రోడ్డుకు అడ్డంగా చెట్టు మొదలు

ముస్తాబాద్: ముస్తాబాద్ కూరగాయల మార్కెట్ వద్ద శివాలయం పక్క సందును పంచాయతీ అధికారులు బ్లాక్ చేశారు. పాత రాజిరెడ్డి దవాఖాన పక్క సందులో ఇటీవల పంచాయతీ పాలకవర్గం సీసీ రోడ్డును వేసింది. రోడ్డు వెడల్పులో తొలగించిన చింతచెట్టు భారీ వేర్లను సీసీ రోడ్డుకు అడ్డంగా వదిలిపెట్టి వెళ్లారు. దీంతో మార్కెట్ నుంచి సింగిల్విండో కార్యాలయానికి వెళ్లే రహదారి మూసుకుపోయింది. పైగా చెట్టు వేర్ల పక్కన సీసీ రోడ్డుపై నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఆ పరిసరాలు దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు వృథా కాగా, సీసీ రోడ్డుపై మూత్రవిసర్జన ఇక్కడ నిత్యకృత్యంగా మారింది. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని మార్కెట్లో ఉన్న వ్యాపారులు కోరుతున్నారు.

ఎస్సీ కాలనీల్లో వసతులు కల్పిస్తాం



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచ్

ముస్తాబాద్: ముస్తాబాద్ ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ గాండ్ల సుమతి అన్నారు. ఆదివారం కాలనీలో నూతనంగా వేసే సీసీ రోడ్డు పనుల తీరును పరిశీలించారు. ఎస్సీ సబ్ప్లాన్లో భాగంగా కాలనీలో వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, గూడూరి భరత్, ముక్క మల్లయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సన్మానం చేస్తున్న కాపు సంఘం సభ్యులు

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, కరీంనగర్ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చల్ల హరిశంకర్ను చిన్నబోనాల మున్నూరు కాపు సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. స్వగ్రామం సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలకు వచ్చిన సందర్భంగా ఆయనని శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో చల్ల హరికృష్ణ, ప్రభాకర్, పరుశురాంగౌడ్, శంకర్, సాయి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాజన్న రాజ్యం షర్మిలమ్మతోనే సాధ్యం

- వైఎస్సార్టీపీ నియోజకవర్గ ఇన్చార్జి సత్యరాజ్వర్మ



మెనిఫెస్టో ప్రతులు అందిస్తున్న సత్యరాజ్వర్మ

బోయినపల్లి: రాష్ట్రంలో రాజన్న రాజ్యం రావాలంటే షర్మిలమ్మతోనే సాధ్యమని వైఎస్సార్టీపీ నియోజకవర్గ ఇన్చార్జి తడగొండ సత్యరాజ్వర్మ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్టీపీ మెనిఫెస్టోపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు షర్మిలను ఆదరించి అధికారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీమకుర్తి లక్ష్మన్, కందుల అంజయ్య, తోడేటి కిరణ్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్లో పొనుగంటి సందీప్చారి జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ముస్తాబాద్ దగడ్స్ జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో దగడ్స్ జట్టు ఎంసీసీ జట్టుపై గెలుపొందింది. విజేతకు రూ.10 వేలు, రన్నరప్కు రూ.5 వేల నగదు, ట్రోఫీలు అందజేశారు. 22 జట్లు పాల్గొన్న టోర్నమెంట్ను పది రోజుల పాటు నిర్వహించారు. కొడుముంజ శ్రీనివాస్, వరి వెంకటేశ్. ఆర్గనైజర్లు శేఖర్, కిట్టు, దౌెట్టి నాని, కోల కృష్ణ పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మీవీధి, ఉప్పుగడ్డడ, మొదటి బైపాస్ రోడ్డు, సుభాష్నగర్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, తిప్పాపూర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెస్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంఘాలు - ఎన్నికలు

ఎంసీపీఐ మండల కమిటీ

కోనరావుపేట: ఎంసీపీఐ మండల కార్యదర్శిగా మంగిలిపల్లి దేవరాజు, సహాయకార్యదర్శిగా భువనగిరి హనుమాన్, కమిటీ సభ్యులుగా ముదాం రవీందర్, రాములు, పర్శ రాములు ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు గోలి వేణు , చేనేత కార్మిక సంఘం సిరిసిల్ల టౌన్ అధ్యక్షుడు కట్ల లక్ష్మీనారాయణ తెలిపారు.

మల్లన్న ఆలయ కమిటీ

కోనరావుపేట: మండలం నిమ్మపల్లిలోని పుట్టల మల్లన్న దేవాలయ కమిటీ చైర్మన్గా చెకుట మహేశ్యాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం సమావేశమైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్చైర్మన్గా ఎక్కల్దేవి కొమురయ్య ఎన్నికయ్యారు.

'అక్రమ వెంచర్పై చర్యలు తీసుకోవాలి'

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ఆర్అండ్ఆర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ వెంచర్ ఏర్పాటు చేసి, ప్లాటింగ్ చేస్తున్న రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య తెలిపారు. ఆర్అండ్ఆర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ రోడ్డునే వెంచర్కు దారిగా వాడుకుంటున్నా అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. సర్వే నంబర్ 357లో చేపడుతున్న అక్రమ ప్లాటింగ్ను అధికారులు వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్ఆర్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నట్లు గతంలో కలెక్టర్కు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేవన్నారు.

కొత్త భవనంలోకి..

తంగళ్లపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయం కొత్తగా నిర్మించిన సొంత భవనంలోకి మారినట్లు ఎంపీడీవో పి.లచ్చాలు తెలిపారు. ఇప్పటికే సామాగ్రిని, రికార్డులను తరలించామని సోమవారం నుండి కార్యకలాపాలు సొంత భవనం నుంచే సాగుతాయన్నారు. వివిధ సేవల నిమిత్తం వచ్చే ప్రజలు నూతన భవనానికి రావాలని సూచించారు..

రుణమాఫీ వెంటనే చేయాలి

ఇల్లంతకుంట: తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ వెంటనే చేయాలని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి బత్తిని స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'లక్ష రుణ మాఫీ తప్పకుండా చేయాలని అన్నారు. రైతు రుణమాఫీ చేయని పక్షంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు

ఎల్లారెడ్డిపేట: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని ఎస్సై శేఖర్ అన్నారు. మండలంలోని దుమాల ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించి, ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు, వాహన ధ్రువీకరణపత్రాలు, లైసెన్స్ దగ్గర ఉంచుకోవాలన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలం కిష్టునాయక్ తండాలో విద్యుత్ ప్రమాదంలో పత్తి, పూరిగుడిసెను కోల్పోయిన భూక్య సక్కు నాయక్ కుటుంబాన్ని సేవాలాల్ స్వచ్ఛంద సమితి ప్రతినిధులు పరామర్శించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సమితి ప్రతినిధులు భూక్య కళావతి హజు నాయక్, భూక్య గజన్ లాల్ నాయక్, అజ్మీరా రవి నాయక్, రవిలాల్, భూక్య లింగం నాయక్, బిక్కన్ నాయక్, సర్పంచ్ ప్రభు నాయక్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి మోక్షమెప్పుడో.?

- నిధులు మంజూరై ఆరు నెలలు
- టెండర్లు రద్దుతో ఆగిన పనులు



ఇల్లంతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే చాలు భవనం ఊరుస్తోంది, పైకప్పు పెచ్చులు ఊడిపోతుండటంతో వైద్య సిబ్బంది, ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని 33 గ్రామపంచాయతీలు, 15 అనుబంధ గ్రామాలకు ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. దీంతో ఆస్పత్రికి రోజు రోజుకు రోగుల తాకిడి పెరుగుతుండటంతో స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంత్రులు కేటీఆర్, హరీశ్రావు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి రూ.1.56 కోట్లను మంజూరు చేయించారు. నూతన భవనం నిర్మిస్తే ఇటు వైద్య సిబ్బంది, మరోవైపు రోగుల సమస్యలన్నీ తీరుతాయని సంబరపడితే నిధులు మంజూరైన కూడా ఇంకా నిర్మాణం పనులు మొదలు కాలేదని ప్రజలు, వైద్య సిబ్బంది అనుకుంటున్నారు. త్వరగా భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

టెండర్ పూర్తయినా మొదలు కాని పనులు

పీహెచ్సీ నూతన భవనం నిర్మాణం చేసేందుకు ఇల్లంతకుంటకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఓ కాంట్రాక్టు సంస్థ పేరున టెండర్ వేసుకోగా, వరంగల్కు చెందిన ఓ కాంట్రాక్టు సంస్థ టెండర్ వేసింది. ఇద్దరు కాంట్రాక్టర్లు సరైన టెండర్ పత్రాలను దాఖలు చేయకపోవడంతో టెండర్ రద్దు చేశారు. తిరిగి టెండర్లు ప్రకటించడంలో జాప్యం జరుగుతోంది. ఈ విషయంలో రాజకీయ ప్రమేయం ఉండడం వల్లే టెండర్ ప్రక్రియలో జాప్యానికి కారణమని పలువురు భావిస్తున్నారు.

భవనం పూర్తయితేనే సమస్యలకు పరిష్కారం

పీహెచ్సీలో సరైన సదుపాయాలు లేక చాలామంది ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. నూతన భవన నిర్మాణం పూర్తయితే ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందనుంది. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం



ఇల్లంతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయి. టెండర్ ప్రక్రియ కూడా తుదిదశకు చేరుకుంటుంది. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకారంతో నిధులు మంజూరు చేసుకోవడం జరిగింది. పనులను ప్రారంభించి నూతన భవనాన్ని ప్రజలకు అందుబాటులో తప్పకుండా తెస్తాం.

–పుట్కూరి వెంకటరమణారెడ్డి, ఎంపీపీ, ఇల్లంతకుంట